


సంచలన సాయంకాల పత్రిక

# సత్యం

https://www.satyamdaily.net/

బుధవారం 28-5-2025

సంపుటి: 21 సంచిక: 55
పేజీలు: 8 వెల: రూ.1

# కారుణ్య కోటాకు కన్నం!


- ఆరుగురి నియామకాల ఫైలులో చేతివాటం
- ఒకరి పేరు బదులు మరొకరి పేరు చేర్చి నాటకం
- ఆ విషయం బయటపడటంతో ఫైలునే తొక్కిపెట్టిన వైనం
- పైగా మంత్రి అచ్చెన్న ఆపమన్నారంటూ డీబీసీడబ్ల్యూవో సాకులు
- విచారణకు కలెక్టర్ ఆదేశాలు


గ్రీవెన్స్‌లో కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితులు

**సర్వీసులో ఉండగా మృతి చెందే ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి అర్హతల ఆధారంగా కారుణ్య నియామకాల కోటాలో ఉద్యోగం ఇస్తుంటారు. కానీ జిల్లాలో ఆరుగురి కారుణ్య నియామకాల ఫైలు దాదాపు ఐదు నెలలు గడిచినా వెలుగు చూడటంలేదు. గత డిసెంబర్ 27న ఈ నియామకాలపై జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. అదే రోజు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ కూడా సంతకం చేసేశారు. కానీ ఇప్పటికీ అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు అందకపోవడంతో వారంతా కార్యాలయాలు, అధికారులు, ప్రజాప్రతినిధుల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఈ జాప్యానికి కారణం.. జిల్లా బీసీ సంక్షేమాధికారి నిర్వాకమే. కారుణ్య కోటాలో ఆరుగురిని నియమించాల్సి ఉండగా.. అందులో అర్హులైన ఒకరిని తొలగించి ఆ స్థానంలో అనర్హుడిని చేర్చడంతో అవకాశం కోల్పోతున్న అసలు అభ్యర్థి కుటుంబీకులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో మొత్తం ప్రక్రియ నిలిచిపోయింది.**

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బీసీ సంక్షేమశాఖలో ఆరుగురి కారుణ్య నియామకాలకు సంబంధించిన ఉత్తర్వులపై ఐదు నెలల క్రితమే కలెక్టర్, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సంతకాలు చేసేశారు. అయినా ఇప్పటికీ అభ్యర్థులకు పోస్టింగులు లభించలేదు. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి సంతకం చేసిన వెంటనే అభ్యర్థులకు నియామక ఉత్తర్వులు ఇవ్వాల్సిన జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారిణి వాటిని తొక్కిపెట్టేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. నియామక ఉత్తర్వుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో పలాస, ఆమదాలవలస ఎమ్మెల్యేలు గౌతు శిరీష, కూన రవికుమార్‌లను బాధితులు వేర్వేరుగా కలిసి నియామకాల్లో జరుగుతున్న జాప్యంపై ఫిర్యాదు చేశారు. దాంతో వారిద్దరూ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్ సదరు నియామకాల ఫైల్ తీసుకుని తన వద్దకు రావాలని జిల్లా బీసీ సంక్షేమాధికారి అనురాధను రెండుసార్లు ఆదేశించారు. అయినా ఆమె కలెక్టర్‌ను కాకుండా కలెక్టరేట్ ఏవో సూర్యనారాయణను కలిసి వచ్చేసినట్టు తెలిసింది. డీబీసీడబ్ల్యూవో అనురాధపై వచ్చే ఫిర్యాదులను తొక్కిపెట్టేస్తూ ఏవో సూర్యనారాయణ ఆమెకు కొమ్ము కాస్తున్నారన్న ఆరోపణలు మొదటి నుంచి ఉన్నాయి. కలెక్టర్ పీఏ కూడా ఆమెకు అండగా ఉంటారన్న ఆరోపణలు ఉన్నాయి. దీంతో బాధితులు గ్రీవెన్స్‌లో నేరుగా కలెక్టర్‌ను కలిసి కారుణ్య నియామక ఉత్తర్వుల జారీలో అనురాధ చేస్తున్న జాప్యంపై ఫిర్యాదు చేశారు. దాంతో కలెక్టర్ ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేసి, తక్షణమే ఉత్తర్వులు ఇవ్వాలని ఆదేశిస్తూ.. ఆ బాధ్యతను కలెక్టరేట్ ఏవోకు అప్పగించారు.


OFFICE OF THE
DIST.B.C.WELFARE OFFICER,
SRIKAKULAM.

Rc.No.A2/65/2016/BCW — Dt.02.12.2016

MEMO

Sub: - BCWD – Srikakulam District – Outsourcing Establishment – Supply of Man Power to Govt B.C.Hostels of BC Welfare Department – Reg.

Ref :- 1) Representation of the Hostel Welfare Officer, GBH(BC) P.K.V.Palem, Dt.21.11.2016.
2) Marginal Remarks of the Dist.B.C.Welfare Officer, Srikakulam, Dt.24.11.2016.

******


In the reference 1st cited, the Hostel Welfare Officer, GBH(BC) P.K.V.Palem has informed that K.Rama Rao (Outsourcing) was very irregular to his duty and he was not attending his duties from 17.09.2016 without any intimation.

Hence, the Managing partner, Sai Surya Placements, Srikakulam is directed to remove the above individual K.Rama Rao (Outsourcing) immediately and fill up the post of the above individual for smooth functioning of Hostel and the the Managing partner, Sai Surya Placements, Srikakulam is also directed to fill up the available vacancy in the Outsourcing Gov. B.C.College Girls Hostels List and report compliance to this office immediately.

Dist.B.C.Welfare Officer,
Srikakulam.


To,
M/s Sai Surya Placements, Srikakulam for further action in this regard.

రామారావును 2016లో టెర్మినేట్ చేస్తూ ఇచ్చిన ఉత్తర్వులు




### జిల్లా మంత్రి చెప్పారని సాకులు

గ్రీవెన్స్ ఫిర్యాదులపై తక్షణం స్పందించాల్సిన అనురాధ మూడు రోజులు కావస్తున్నా నియామక ఉత్తర్వులు జారీ చేయకపోగా కొత్త నాటకానికి తెర తీశారు. కారుణ్య నియామకాలను నిలిపివేయమని జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారంటూ కొత్త వాదన తీసుకువచ్చారు. నియామకాల ఫైలుపై గత డిసెంబర్ 27న కలెక్టర్ సంతకం చేశారు. ఆ వెంటనే డీబీసీడబ్ల్యూవో అనురాధ, ఆ కార్యాలయ సూపరింటెండెంట్ పార్వతిలను కారులో విజయనగరం జిల్లా గజపతినగరంలోని ఇన్‌ఛార్జి మంత్రి క్యాంపు కార్యాలయానికి పంపించి సంతకం చేయించారు. కలెక్టర్,


Ref:
1. Representation of the SmtP.Parvathi W/o P.Ramesh(late) in Grievance PrajaSamasyalaParishkaaraVedika (No:6947) Dt.14.11.2022.
2. Representation of the Smt.K.Tejavathi W/o K.Ramarao(late) in Grievance PrajaSamasyalaParishkaaraVedika(No:8501) Dt.29.11.2022.
3. S.R.No.18/VIP/2023/H10/Dt.20.01.2023 of the Collector's Office, Srikakulam,Dt.24.01.2023.
4. Representation through the Hon'ble Minister of Revenue, Registration & Stamps, Govt . of A.P., Dt.19.01.2023.
5. Grivance Representation of Ms.BurudiHimabindu D/o late BuridiSaritha (OCS Employee, CGHBC SKLM-IV), Dt. 31. 07. 2023.
6. Grivance Representation of Smt.D.Dhana Lakshmi D/o late D.Kanakaratnam (OCS Employee, CGHBC SKLM-III), Dt. 04. 03. 2024.
7. Representation of Smt.SuvvariSuneetha W/o S.Lokanadham (late), Dt:28.10.2024.
8. G.O.MS. No. 136 General Admin. (SU I) Dept. Dt.04.12019
9. Circular Memo No.GAD01-SUOMISC/31/2019-SU-I,dt.20.11. 2019.
10. Note Orders of the District Collector, Srikakulam, Dt:20.12.2024.
11. Letter GAD01-SUOMISC/31/2019-SU-I Dt.09.10.2020 of the Secretary (Services), GAD & Chairman, APCOS.
12. Govt. Circular Memo. No: GAD 01-SUOMISC/31/2019-SU-I Dt:23-10- 2020.

*****

Kind attention is invited to the references cited.

It is submitted that,in the reference 1st to 7th cited, 6(six) representations received from Local Representatives/ VVIP's in Srikakulam District and at Monday Grievance(PrajaSamasyalaParishkaaraVedika)and requested for appointment of Outsourcing employees on compassionate grounds in the existing vacancies.

| S.No. | Name of the Candidate request to provide appointment on compassionate grounds | Name of the Outsourcing Employee deceased & Designation: | Date of Birth (as per Aadhar card) & Age | Name of the Local Representatives / VVIP's and Grievance Representations | Name of the Post & Proposed Hostel for appointment on outsourcing basis. | Contact No: | Qua |
|---|---|---|---|---|---|---|---|
| 1 | Smt. P.Parvathi | Sri Palla. Ramesh(late) :- Govt.BC Boys Hostel Priyagraharam. Designation: Attender | 01.01.1988 (35 years) Caste: BC-A | At Monday Grievance.. | Name of the Post: Cook Govt. BC Hostel Rajapuram | 8143719585 | 7 |
| 2 | Smt.K.Tejavathi | Sri K.Ramarao (late):- Govt. BC Boys Hostel P.K.V.Palem. | 01.01.1978 (45 years) Caste: BC | At Monday Grievance. | Name of the Post: Cook Govt. BC Hostel P.K.V.Palem | 8985482049 | |

నియామక జాబితాలో అనర్హుడి పేరు

- మిగతా చివరి పేజీలో

# బానిస వ్యాపారుల వేలం పాట అందాల పోటీ







## నేను వేశ్యను కాదు మిస్ ఇంగ్లాండ్ సంచలనం

దేవి, సామాజిక కార్యకర్త, (ది వైర్ కోసం..)

హైదరాబాద్ నగరం ఈసారి అందాల పోటీకి వేదికగా మారింది. మహిళా సంఘాలన్నీ మూకుమ్మడిగా దీనికి వ్యతిరేకంగా నిరసనకు దిగాయి. టూరిజం నుంచి రూ.15 కోట్లు మహిళా సాధికారిత(?) కోసం మరో రూ.10 కోట్లు కలిపి రూ.25 కోట్ల సొమ్మును ఉడతా భక్తిగా అందజేస్తామని తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. అంతమంది 'అందమైన' పడతులు కనువిందు చేస్తుంటే ఆనందించాలి కానీ ఏమిటీ ఇదంతాని 'మగ కళ్లు' అంటున్నాయి. అందాల పోటీ వల్ల ఒకరిద్దరు హీరోయిన్లు దొరక్క పోతారాని సినిమా వాళ్ల ఆశ. అందం ఆడోళ్ల సొంతం.. చక్కగా ప్రదర్శిస్తే తప్పేంటని ఉదారవాదం మెదళ్లు విసుక్కుంటున్నాయి. అస్సలు దానికెంత కష్టపడాలో ఎంత శ్రమ, ఎంత శిక్షణ అవసరమో తెలుసా? లుక్స్ లేకుండా ఎలా మనగలుగుతామని అమ్మాయిలు అంటున్నారు. ఈ మహిళా సంఘాలు ఏవో కేసులు అవి చూసుకుని మహిళా ఉద్ధరణ చేయాలి కానీ అందంపై దాడి ఏంటని మరికొందరు నిగ్గదీస్తున్నారు. మీడియా మైలేజ్ కోసం మహిళా సంఘాలు దీన్ని ఎంచుకున్నాయని కెమెరాల వెనుక గొనుగుతున్నది. మరి మహిళా సంఘాల బాధ ఏంటి?

ఉదారవాద శరీరాలను, మనసులను ఉదారవాద ఆర్థిక విధానాలు తయారు చేస్తాయి. ఈ ఆర్థిక విధాన కాలంలో విపరీతమైన వేగంతో 'అందాల పరిశ్రమ' పెరుగుతోంది. కాస్మోటిక్స్ చర్మం నుంచి గోళ్ల వరకు శరీరంలో ప్రతి అంగాన్ని ప్రత్యేకంగాను, శరీరం మొత్తం అందంగా చూపించే లేపనాలు, రంగులు, తాత్కాలికం – శాశ్వతమైన పూతలు అన్ని కలిపి మందుల పరిశ్రమ కంటే ఈ పరిశ్రమ ముందుంది.

శరీరంలో ఏ అవయవం అందంగా లేకున్నా అందంగా మల్చడం. శరీరం మొత్తాన్ని అంచెలంచెలుగా మార్చడం, నాజూకుగా తయారు చేయడం. శరీరంలోని కొవ్వును తీయడం కాస్మోటిక్ సర్జరీలో భాగంగా ఉంది. ప్రస్తుత రోజుల్లో ఇది వైద్య వృత్తి నిపుణత్వంలో మంచి డిమాండేడ్ శాఖగా ఆవిర్భవించింది. ఇక స్పాలు, బాడీ మసాజ్, బ్యూటీ పార్లర్లు, ఫ్యాషన్ డిజైన్లు, నడకతో పాటు ఎలా నవ్వాలో నేర్పే శిక్షణా తరగతులు కూడా అందుబాటులోకి వచ్చాయి. అంతేకాకుండా తిండి ఏం తినాలో, ఎంత తినాలో చెప్పే డైటీషియన్లు, పర్సనల్ ట్రైనర్లు, అందాన్ని గుర్తించే నిపుణులు, సలహాదారులు కూడా ఉన్నారు. కెమెరా వాళ్లు, వాటి ప్రసారకులు యాడ్ ఏజెన్సీలు, సినిమా వాళ్లు చివరగా అందాల పోటీ నిర్వహణ, పరిశ్రమ, దాని జడ్జీలు, నిర్వాహకులు, వేదికలు, శరీర అందాన్ని ప్రమాణీకరించేవారు, కొలతలు వేసేవాళ్లు వగైరాతో కూడిన పెద్ద మానవ పరిశ్రమ కొనసాగుతోంది. ఇదంతా కాకుండా గత పదేళ్లలో ఈ అందపు అంటురోగంతో సామాజిక మాధ్యమం అత్యధికంగా ప్రభావితమై, లాభపడింది.

**శరీరంలో ఏ అంగాలు అందంగా ఉండాలి...**

మొహం, కాళ్లు, చేతులు వగైరా అయిపోయాయి. 1990 దశకంలో నాజూకుగా ఉండాల్సింది మోచేతి పైన జబ్బలు. 2000 సంవత్సరం తర్వాత చంకలు.. అవి నల్లగా ఉండకూడదు. తర్వాత కనుబొమ్మలు, ప్రస్తుతం రెండు తొడల మధ్య ఉండాల్సిన దూరం (నిలబడితే స్త్రీ తొడల మధ్య రెండు అంగుళాల నుంచి మూడు అంగుళాల దూరం కనపడాలని, అవి నాజూకు తొడలు – కాళ్లకు నిదర్శనమని ఇటీవలే ప్రామాణీకరించారు). దీంతోపాటు బికిని వారధి, స్థనాల కింది భాగం అందము, తొడలపై కింది మందం వగైరాలు ఈ జాబితాలో చేరాయి. కాబట్టి స్త్రీల శరీరాలు అందంగా ఉండి తీరాల్సిన భాగాల అన్వేషణ వాటిని అందంగా చేసుకోవాలనే ఒత్తిడి నిరంతరాయంగా కొనసాగుతుంది.

అందానికి ఆరోగ్యానికి మధ్య తేడా తెలియకుండా, అందంగా కనబడటమే ఆరోగ్యంగా ఉండటం అంటే, నేను అందంగా కనపడ్డాననే భావనే ఆరోగ్యం అనే దశకు యువతులను చేర్చాయి. అందం అనే ఒక మానసిక భావనను ఆత్మవిశ్వాసం, సాధికారితకు జోడించాయి. దీంతో వడపోసిన చిత్రాలు, మార్చిన ఫొటోలతో సామాజిక మాధ్యమాల్లో అందం ఏరులై పారుతున్నది.

అందంగా ఉండాలనే ఒత్తిడి లేని అనేక సమయాలు, సందర్భాలు స్త్రీల జీవితాల్లో అనేకం ఉండేవి. ఇప్పుడు వాటిని కూడా ఈ అందం వ్యాపారం ఆక్రమించింది. పుట్టుక, పసితనం, బాల్యం, ఆటలు ఆడటం, నిద్రపోవటంతో సహా కాలాన్ని దేన్ని కూడా ఇది వదలటం లేదు. జీవితంలో ప్రతి దశలో ప్రతి ఒక్క స్థితిలో అందంగా కనపడే తీరాలి. 'ఎప్పుడు త్వరపడినట్టు కాదు, ఎప్పుడు ప్రారంభించిన ఆలస్యం కాదు' ఇది ఒక చర్మం రంగుని మెరుగుపరిచే పూత పసిపిల్లలకు వాడొచ్చా (దానిలో పాదరసం ఉంటుంది) అని అడిగిన దానికి జవాబు అంటే పసితనపు లేత చర్మానికి ఈ రసాయనాలు హానికరం అయినవైనా పూసేయండి అందంగా ఉండాలి కదా అని అర్థం. వయస్సు మీరుతున్నదని ఆందోళన, ముడతల గురించిన ఆవేదన వీటన్నింటిని సృష్టించేది వీటికి పరిష్కారం ఇచ్చేది కూడా అందాల పరిశ్రమే.

**అంగాంగాన్నీ సూక్ష్మస్థాయిలో నిఘావేసి మరీ..**

వ్యాపార ప్రపంచపు నిఘాకు అవసరమైన ఛాయాచిత్రాలు తీసేటప్పుడు కూడా స్త్రీ శరీరాన్ని అణువణువు కవర్ చేస్తూ, శరీరంలో ఎక్కడ ఒక్క మడత కానీ నల్లని గీతలు కానీ (ట్యానింగ్) కూడా కనబడని స్థాయిలో జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో స్త్రీల శరీరంలో అంగాంగాన్ని సూక్ష్మస్థాయిలో నిఘా వేసి మరి చూస్తున్నారు. ఆధునిక కెమెరాల స్థాయికి తగినట్లుగా మనల్ని మనం కూడా హెచ్‌డీ మెరుపులకు సరిపడేలా తీర్చిదిద్దుకోవాల్సి వస్తుంది. దీనికి తోడు స్త్రీలు తమను తాము సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటూ సామాజిక మాధ్యమాల్లో అప్లోడ్ చేస్తూ లైక్‌ల కోసం ఎదురుచూస్తూ తమపై తామే సామాజిక నిఘాకు తలుపులు తీస్తున్నారు. ఇంత సూక్ష్మ పరిశీలన నేత్రం. మైక్రోస్కోప్‌తో జరిగినంత వివరంగా స్త్రీల శరీరాలపై జరుగుతుంది. కరోనా వైరస్‌పై కూడా ఇంత జరిగి ఉండకపోవచ్చు.

ఇంట్లో ఉంటున్న తల్లి కూడా నిరంతరం అందంగా కనపడేలా తన్ను తాను తీర్చిదిద్దుకోవాలి. బిడ్డకు పాలిచ్చినా, లేకున్నా గర్భవతి కాక పూర్వం ఉన్న స్థితికి శరీరాన్ని తీసుకు రావడానికి ఆ తల్లి శ్రమ పడాలి. అంతదాకా అందపు ఒత్తిడి

- మిగతా వెనుక పేజీలో




**నన్ను వేశ్య లాగా చూశారు**
**మిస్ వరల్డ్ 2025 అందాల పోటీలో నన్ను వేశ్యలా చూశారు అంటూ మనస్తాపంతో వెళ్ళిపోయిన మిస్ ఇంగ్లాండ్ మిల్లా మాగీ**

• ఎడిటోరియల్

# అక్కడ సీజ్‌ఫైర్.. ఇక్కడేమో ఓపెన్ ఫైర్!

పహల్గాంలో అమాయక టూరిస్టులపై ఉగ్రవాదులు సాగించిన మారణకాండ తర్వాత ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తూ తమ దేశం పైకి ఎగదోస్తున్న పాకిస్తాన్‌పై భారత్ ఆపరేషన్ సింధూర్ పేరుతో నాలుగు రోజులపాటు యుద్ధం చేసింది. సైనిక చర్యలో ఆధిపత్యం సాధించి, గెలుపు ముంగిట నిలిచిన తరుణంలో చేతులెత్తేసిన పాకిస్తాన్ కోరిన వెంటనే కాల్పుల విరమణకు భారత్ అంగీకరించడంపై దేశంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అయితే మావోయిస్టుల విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరి దీనికి పూర్తి విరుద్ధంగా ఉంది. ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర ం నారాయణపూర్ జిల్లా అబూజ్‌మడ్ అడవుల్లో జరిగిన భారీ ఎన్‌కౌంటర్‌లో సీపీఐ(మావోయిస్టు) పార్టీ ప్రధాన కార్యదర్శి, మోస్ట్ వాంటెడ్ నంబాల కేశవరావుతో సహా 28 మంది మావోయిస్టులు హతమయ్యారు. దీనిపై మావోయిస్టు పార్టీ దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ జారీ చేసిన ఒక ప్రకటనలో కేంద్రం తీరును తప్పుపట్టింది. దేశంపైకి ఉగ్రవాదాన్ని ఎగదోస్తూ మారణహోమం సృష్టిస్తున్న పాకిస్తాన్ ప్రతిపాదించిన వెంటనే కాల్పుల విరమణ(సీజ్ ఫైర్)కు అంగీకరించిన భారత ప్రభుత్వం.. తాము కొన్నాళ్లుగా కాల్పులు విరమించి చర్చలకు సిద్ధమని చెబుతున్నా పట్టించుకోకుండా ఆపరేషన్ కగార్ ద్వారా మారణకాండ సృష్టిస్తోందని విమర్శించింది. మరోవైపు తాజా ఎన్‌కౌంటర్‌లో నంబాల కేశవరావు సహా 28 మంది మావోయిస్టులను హతమార్చడాన్ని ఘన విజయంగా, గర్వకారణంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలు ప్రకటించడం ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న భద్రతా బలగాలను అభినందించడం ద్వారా ప్రజాస్వామ్యానికి, మానవత్వానికి మచ్చ తెచ్చేలా వ్యవహరించారని మానవ హక్కుల వేదికకు చెందిన డాక్టర్ తిరుపతయ్య విమర్శించారు. కేంద్రం కొన్ని నెలలుగా మావోయిస్టు పార్టీపై యుద్ధం ప్రకటించి, ఆపరేషన్ కగార్ పేరుతో దండకారణ్యంతో దళాలపై విరుచుకుపడుతోంది. మావోయిస్టుల విధానాలతో చాలామంది విభేదించవచ్చు. దేశ ప్రజలు గతంలో కంటే మెరుగ్గా అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో సమసమాజ నిర్మాణానికి మావోయిస్టు పార్టీ ఇప్పటికీ అనుసరిస్తున్న పాత విధానాలకు కాలం చెల్లిపోయింది. వారు చేపడుతున్న హింసాత్మక చర్యలు గిరిజన, అటవీ ప్రాంతాల్లో ప్రశాంతతను దెబ్బతీయవచ్చు. అదే సమయంలో వారు పాల్పడిన నిరర్థక హింస కంటే.. వారు అనుభవించిన రాజ్యహింసే ఎక్కువ అని ప్రజాసంఘాలు అభిప్రాయపడుతున్నాయి. సిద్ధాంతాల పేరుతో తుపాకీ పట్టిన మావోయిస్టులు తొలి నుంచీ పీడిత ప్రజల పక్షమే వహించారు. అయితే ప్రభుత్వం మాత్రం కార్పొరేట్లకు రెడ్ కార్పెట్ పరుస్తూ వనరులు దోచుకునే అవకాశం కల్పిస్తోందన్నది ప్రధాన ఆరోపణ. ఈ అంశాలపై తుపాకులకు విశ్రాంతినిచ్చి ప్రభుత్వంతో చర్చిస్తామని.. అందుకు అవకాశం కల్పించాలని రెండు నెలలుగా మావోయిస్టులు అభ్యర్థిస్తున్నా ఖాతరు చేయకుండా కేంద్ర ఏరివేత దిశగా సాగుతుండటాన్ని ప్రజా సంఘాల ప్రతినిధులు తప్పుపడుతున్నారు. అయితే ఈ యుద్ధంలో ఓటమి తప్పదని తేలిన తర్వాతే మావోయిస్టులు చర్చల ప్రస్తావన తెచ్చారని, వారేమీ శాంతికాముకులు కాదు కనుక చర్చలు జరపాల్సిన అవసరం లేదని ప్రభుత్వపక్షం వాదిస్తోంది. కానీ అందులో తప్పేముంది.. యుద్ధానంతర చర్చలన్నీ అలాగే జరుగుతాయి కదా! అని పలువురు గుర్తు చేస్తున్నారు. చర్చలు జరిగితే మరింత రక్తపాతం ఆగుతుంది కదా! అన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి. పైగా బలహీనపక్షంపై బలంగా ఉన్న ప్రభుత్వం ఎన్ని షరతులైనా పెట్టవచ్చని అంటున్నారు. సమస్య ఏదైనా చర్చించి, రాజకీయంగా పరిష్కరించుకోవటం మానవీయ, ప్రజాస్వామ్య నీతి. కొన్ని సార్వజనీన, మానవీయ, ప్రజాస్వామ్య విలువలను, సూత్రాలను పరిపాలకులైనా, వారిని ధిక్కరించే వారైనా పాటించి తీరాలని కోరుకోవడం, ఆ రకమైన విమర్శ చేయడం పౌరసమాజం బాధ్యత. చైతన్యం నిండిన పౌరసమాజం కలిగిన దేశాల్లోని ప్రభుత్వాలే ప్రజలకు జవాబుదారీగా ఉండగలవు. ఆ దేశాల్లోనే ప్రభుత్వాలు తమ సొంత ప్రజలపై యుద్ధం చేయవు. అటువంటి దేశంలోనే ప్రజల స్వేచ్ఛ, స్వాతంత్ర్యాలు, భద్రత, జీవ వైవిధ్యం, పర్యావరణం, ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలు సజీవంగా ఉంటాయి. మన మధ్య అలాంటి విలువలను నెలకొల్పుకోగలమా? పాలకులు ప్రజాస్వామ్యం, చర్చల ప్రాముఖ్యతను గుర్తించేలా చేయగలమా?!

## శ్రీకాంత్ బృందం ప్రదర్శన విజయవంతం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)


జపాన్ పర్యటనలో ఉన్న జిల్లాకు చెందిన శ్రీకాంత్ రఘుపాత్రుని శిష్య బృందం 3వ రోజు వేడుకల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. అంతర్జాతీయ సమగ్రతలో భాగంగా థాయిలాండ్ వారితో జుగల్బందీ ప్రదర్శనతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. థాయిలాండ్ పెవిలియన్ మరియు భరత్ పెవిలియన్‌లో జరిగిన వారి ప్రదర్శన ప్రేక్షకులను మంత్ర ముగ్ధలను చేసింది. వారి ప్రదర్శనను మెచ్చుకుని థాయిలాండ్ నిర్వాహకులు, భారత నిర్వాహకులు వారిని ఘనంగా సత్కరించారు.




## తెలుగువారి ఆత్మగౌరవ ప్రతీక ఎన్టీఆర్

(సత్యంన్యూస్, రణస్థలం)

తెలుగు ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ ప్రజాసేవతో పాటు సినీ, రాజకీయ రంగాల్లోనూ విశేషమైన కృషి చేశారని,పేద ప్రజలు తెల్ల అన్నం తినే రుచి చేసే అవకాశం కల్పించిన మహా నాయకుడు ఎన్టీఆర్ అని,తెలుగుజాతి ఉన్నంతవరకు ప్రజల గుండెల్లో ఎన్టీఆర్ కొలువై ఉంటారని ఎమ్మెల్యే నడికుదుటి ఈశ్వరరావు పేర్కొన్నారు. ఆయన జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ఎన్టీఆర్ జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను స్మరించుకోవడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అనంతరం రణస్థలం మండల కేంద్రంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. తదుపరి కొండములగాంలో ఉన్న గవర్నమెంట్ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంపిణి నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీఆర్ జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఆనందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో నాలుగు మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## గ్రంథాలయంలో ఎన్టీఆర్ జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా బుధవారం బలగ హడ్కో కాలనీలో గల శాఖా గ్రంథాలయంలో మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు గారి 102వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఈ సందర్భంగా పిల్లల్ని ఉద్దేశించి మాట్లాడుతూ 1982 వ సంవత్సరం తెలుగుదేశం పార్టీ స్థాపించి ఆ తర్వాత ఆంధ్ర రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఎనలేని సేవలు అందించారు పేదవారికి బడుగు బలహీన వర్గాల వారికి అనేక సంక్షేమ పథకాలు చేశారని ఈ సందర్భంగా పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో సహాయకురాలు కె అనిత, 22మంది విద్యార్థులు పాల్గొన్నారు



## మహానాడుకు ఎంజీఆర్ విరాళం



(సత్యంన్యూస్, పాతపట్నం)

తెలుగుదేశం పార్టీ కడప జిల్లాలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెండవ రోజు మహానాడులో పాల్గొన్న పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రూ.10లక్షల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులతో కలిసి పండుగలా జరుపుకునే మహానాడు కార్యక్రమం కడపలో ఘనంగా ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమానికి తనతో పాటు ఐదు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారన్నారు. ఈ చెక్కును తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రదాన కార్యదర్శి, ఐటి శాఖా మంత్రి నారా లోకేష్‌ను కలిసి అందించామని స్పష్టం చేశారు.

## గ్రేడ్-2 హెచ్ఎం పదోన్నతుల్లో ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయులకు న్యాయం చేయాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి 1996 నుండి పదోన్నతుల్లో ఎస్సీ ఎస్టీ హెచ్ఎం పదోన్నతుల్లో న్యాయం చేయాలని ఎస్సీ ఎస్టీయూఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోనెల రమేష్, జిల్లా అధ్యక్షుడు వడమ శరత్‌లు డిమాండ్ చేశారు. ఈమేరకు డిఈఓ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రిజర్వేషన్ కల్పించడంలో భాగంగానే 1996 నుండి 2023 వరకు ఇచ్చే పదోన్నతులు అన్నీ కూడా గ్రేడ్-2 హెడ్మాస్టర్ వేరుగా, ఎంఈఓ-1 కేడర్ వేరుగా, ఎంఈఓ-2 కేడర్ వేరుగా ఎస్సీ ఎస్టీ కేడర్ స్ట్రెంత్ చూశారన్నారు. కానీ ప్రస్తుతం జిల్లా పరిషత్ యాజమాన్యంలో కల్పించబోతున్న 80మంది గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల వేకెన్సీలో ఒక ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుడికి చోటు కల్పించకపోవడం అన్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యాంగం కల్పించిన హక్కు కాలరాయడమేనని, సుప్రీం కోర్టు తీర్పును అమలు చేయకపోవడం శోచనీయమని వారు విమర్శించారు. తమతోపాటు వివిధ ఉపాధ్యాయ సంఘాలు దీనిని ఖండిస్తున్నాయన్నారు. ప్రస్తుతం కల్పించబోతున్న జిల్లా పరిషత్ యాజమాన్యంలో 80 గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుల సైకిల్‌లో రాజ్యాంగబద్ధంగా హక్కుగా రావాల్సిన 15% అయిన 12 పోస్టులు తక్షణమే కల్పించాలని శ్రీకాకుళం విద్యాశాఖ అధికారి కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు. అనంతరం వినతి పత్రం అందజేశామని వారు స్పష్టం చేశారు. కార్యక్రమంలో కేఎన్పిఎస్ జిల్లా అధ్యక్షులు దీర్ఘాశి గణేష్ బహుజన టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పడాల ప్రతాప్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ బంగారు షణ్ముఖరావు, జిల్లా కార్యదర్శి కృష్ణమోహన్, ఎస్ టి యు స్టేట్ కౌన్సిలర్ చింతల రామారావు, ఎస్సీ ఎస్టీ టిఎఫ్ కింజరాపు నూకరాజు, పి.చంద్రారావు, ఎస్.అప్పారావు, ఏ.అనంత్, ఎస్ వరప్రసాద్, వైవిఎన్ రాజు, కే.లక్ష్మణరావు, ఎన్.లక్ష్మణరావు, జె.మురళి, ఎస్.హరికృష్ణ, బి.చక్రధర్, టి.వెంకటేశ్వరరావు, ఎ.దామోదర్ రావు, బి.కస్తూరి, వై.అమర్నాథ్, వైవిజి కృష్ణ, వేణుగోపాల్, బంగారి రమేష్, పాల్గొన్నారు.





నిజానికి పాపులర్ సినిమా పాటల మీద కూడా మన వాళ్లు గతం నుంచీ పెద్ద విమర్శో, విశ్లేషణో పట్టించుకోరు. ఇప్పుడంటే ఓ కొత్త సినిమా పాట రాగానే, అదెంత చెత్తగా ఏడ్చినా సరే, మెయిన్ స్ట్రీమ్ మీడియా దగ్గర్నుంచి టీవీలు, సైట్లు, ట్యూబర్లు ఒకటే డప్పు దంచి కొడుతున్నారు. ఇంతకుముందు అసలు సినిమా పాటను ఓ సాహిత్యంగానే పరిగణించేవాళ్లు కాదు. రాసేవాళ్లు, కంపోజ్ చేసేవాళ్లు, ఆడేవాళ్లు, ఆడించేవాళ్లు, పాడేవాళ్లు, తీసేవాళ్లు కూడా దాన్నలాగే భ్రష్టుపట్టించారు. కాకపోతే ఆరుద్ర, ఆత్రేయ, వేటూరి, శ్రీశ్రీ, సినారె తదితరులు కొన్ని మంచి పాటలు రాశారు. (వాళ్లు రాసిన చెత్తా గీతాలు కూడా ఉన్నయ్) అభిరుచి కలిగిన నిర్మాతలో, దర్శకులో అలా రాయించుకున్నారు, దానికి తగిన మంచి ట్యూన్లు సరేసరి.. రాసేవాడికీ, ట్యూన్ కట్టేవాడికీ నడుమ ఓ కనెక్షన్ ఉండేది. అసలు ఇప్పుడు ఒక పాట రికార్డింగ్ అంటే ఎవరి పార్ట్, ఎవరి ట్రాక్ వాళ్లు పాడేసి వెళ్లిపోవడమే.

# గుండెను తాకే పాట.. మంగళంపల్లి నోట ఓ మాయల దెయ్యం!

దాన్ని ట్యూన్‌లో సరిగ్గా ఇరికించేసి, లిరికల్ వీడియో ఒకటి యూట్యూబ్‌లో వదలడమే..ఇక పాటగాళ్లు, కంపోజ్‌గాళ్లు, రాతగాళ్లు కలిసేదెక్కడ? భావాల్ని, శృతుల్నీ పంచుకునేదెక్కడ..? చిన్న చిన్న లోపాలు ఉంటే ట్రాకులు కలిపేసి, లోపాలు సరిదిద్దే యాప్స్,కంప్యూటర్ ప్రోగ్రామ్స్ కూడా వచ్చాయి. అంతెందుకు..? ఎఐ ప్లాట్‌ఫారాలు పాటల్నే కంపోజ్ చేసి, రాసి ఉద్ధరించేస్తున్నాయి కదా..!

ఒకానొక కాలంలో హిమసమూహాలు కురుస్తున్న ఆ రోజుల్లో 1979లో బాలచందర్ సినిమా ఒకటి వచ్చింది, దాని టైటిల్ గుప్పెడు మనసు. సరిత, శరత్, సుజాత తదితరులు తారాగణం.. అప్పట్లో బాలచందర్ సినిమాలు అంటే ఓ క్రేజ్.. కథ, కథనం, డెప్త్, పాటలు, నటన.. ఏక్‌సేఏక్.. ప్రేక్షకుల్ని అలా కట్టిపడేసేవి.

గుప్పెడు మనసులో మంగళంపల్లితో ఓ పాట పాడించారు. రాసిందేమో ఆత్రేయ.. అది మనసు వేదనకు, తత్వానికి సంబంధించి ఎమోషనల్ సాంగ్. మనసు అనగానే ఆత్రేయ మనసు పెట్టి రాస్తాడు కదా.. అంతే మనసుపెట్టి బాలమురళి పాడాడు. ఆయన పాడిన పాటలే తక్కువ. వాటిల్లో ఇదొకటి, ఆయన పేరు వినగానే తట్టే పాట ఇది.(తెలుగులో వైరాగ్యం, ఫిలసాఫికల్ సాంగ్స్ చాలా చాలా తక్కువ).

మంద్రంగా, మనసు లోతుల్ని తడుతూ, తడుముతూ, తడిని తట్టి లేపుతూ సాగిపోతుంది. నిజానికి చాలా సింపుల్ ట్యూన్‌తో, సరళమైన పదాలతో ఆ పాట ఉన్నదే ఏడెనిమిది వాక్యాలు.. కానీ లోతైన భావంతో ఒకసారి వింటే కొంతసేపు వెంటాడుతుంది అలా..

*మౌనమే నీ భాష ఓ మూగ మనసా..*
*తలపులు ఎన్నెన్నో కలలుగ కంటావు..*
*కల్లలు కాగానె కన్నీరవుతావు..*
*చీకటి గుహ నీవు.. చింతల చెలి నీవు*
*నాటక రంగానివే మనసా..తెగిన పతంగానివే ..*
*ఎందుకు వలచేవో.. ఎందుకు వగచేవో*
*ఎందుకు రగిలేవో.. ఏమై మిగిలేవో..*
*కోర్కెల సెల నీవు.. కూరిమి వల నీవు*
*ఊహల ఉయ్యాలవే మనసా.. మాయల దయ్యానివే*
*లేనిది కోరేవు.. ఉన్నది వదిలేవు*
*ఒక పొరపాటుకు యుగములు పొగిలేవు..*

తెలుగు సినిమాల్లో వైరాగ్యాన్ని, మనోవేదనను ఆవిష్కరించే పాటలే చాలా చాలా తక్కువ.. ఆలోచనలో, వేదనలో ముప్పిరిగొన్నపుడు మనసు ఏ భాషలో తల్లడిల్లుతుంది.. ఏమీ ఉండదు, మౌనంలోని జారిపోతుంది.

అడుగులు అకస్మాత్తుగా ఆగిపోయి, గమ్యమేమిటో తోచనప్పుడూ అంతే.. ఉద్వేగం గాఢత పెరిగినా అంతే.. అసలు మనసే పెద్ద సమస్య. ఓపట్టాన నిలవనివ్వదు, ఉరకనివ్వదు.. అసలు మన మనస్తత్వాల, మనసు తత్వాల గురించి ఎవరైనా సమగ్రంగా ఏం చెప్పగలరు..?

ఏదో ఆత్రేయ వంటి రచయిత అయితే కాస్త పట్టి చూపించగలడు. అదొక ఊహల ఉయ్యాలా, మాయల దెయ్యం అని టక్కున తేల్చేస్తాడు. లేనిది కావాలంటుంది మనసు, ఉన్నది వదిలేస్తుంది, తృప్తి- నిలకడ లేని మనసు ఓ చీకటి గుహ కాకపోతే, చింతలచెలి కాకపోతే మరేమిటి..?

అంతే.. ఇదొక నాటకరంగం, తెగిన పతంగం.. ఎవరిని ఎందుకు ప్రేమిస్తుందో తెలియదు, ఎందుకు రోదిస్తుందో తెలియదు, చివరకు ఏమైపోతుందో తెలియదు.. ఒక పొరపాటు చేసి ఇక ఏడుస్తూనే ఉంటుంది. నిజంగా ఇదేపాట మరొకరు పాడితే ఈ భావం ఇంత బాగా ధ్వనించేదా..? సందేహమే!! కొన్ని పాటలు కొన్ని గొంతుల నుంచే రావాలి.. మనసును ఓ వేదనకు గురిచేస్తూ నిశ్శబ్దాన్ని ఆలపిస్తూ!!!

- ముచ్చట సౌజన్యంతో..





పాలకొండ శాఖా గ్రంథాలయంలో మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ 102వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ కె.శివకుమార్, చంద్రశేఖర్, పురుషోత్తం, కె.ధరణి, ఇన్‌చార్జ్ గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

– సత్యంన్యూస్, పాలకొండ

## ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు గారి 102 వ జయంతి ఉత్సవాలు స్థానిక సూర్యమహల్ జంక్షన్ వద్ద ఎన్టీఆర్ అభిమాన సంఘాల అధ్యక్షులు బరాటం ఉదయశంకర్ గుప్తా, జిల్లా తెలుగుదేశం పార్టీ సాంస్కృతి విభాగ అధ్యక్షులు, రాష్ట్ర దేవాంగుల సాధికార సమితి డైరెక్టర్ గుత్తు చిన్నారావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి, తెలుగు మహిళా అధ్యక్షురాలు గొండు స్వాతి ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్టీఆర్ ఆశయసాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నగర అధ్యక్షులు మాదారపు వెంకటేష్ ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణ రావు, నాయకులు జామ భీమశంకర్, గంగు మల్లేష్, ప్రభాకర్, చంద్రశేఖర్, లొట్టి సూరిబాబు, సుశీల, కటారి కమల, పేట పద్మ తదితరులు పాల్గొన్నారు



## తెలుగువారి శాశ్వత ఆరాధ్య దేవుడిగా ఎన్టీఆర్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగువారి శాశ్వత ఆరాధ్య దేవుడిగా అన్న ఎన్టీఆర్ అని, నటనలో కొత్త ఒరవడిని సృష్టించి ప్రజల గుండెల్లో స్థిర స్థాయిగా నిలిచారని శ్రీకాకుళం నగర నాయకులు తెలిపారు. తారక రామరావు జయంతి సందర్భంగా కడపలో జరుగుతున్న మహానాడు పండగలో ఎన్టీఆర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఇప్పిలి తిరుమల రావు, సవలపురపు వెంకటరమణ మాదిగ, బుర్రి మధు, బొల్లా నాగేంద్ర యాదవ్, అండవరపు శ్రీను, బిల్డర్ విజయ్ కుమార్, ఈసందర్బంగా ఎన్టీఆర్ చేసిన సేవలు గుర్తు చేసుకుంటూ ఆనాడు తీసుకున్న నిర్ణయాలు వలన ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనారిటీ అగ్ర కులాలులో ఉన్న పేదలకు కూడు, నీడ, బట్ట లేనివారికి అందివ్వాలని దృఢ సంకల్పంతో పనిచేసారు. అలాగే రాజకీయాలలో బీసీలకు ఎస్సీల వంటి రాజకీయ ప్రాధాన్యత లేని కులాల వారికి ప్రాధాన్యత ఇస్తూ సంచలనమైన నిర్ణయాలు తీసుకున్న వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయారన్నారు. ఇదే ఒరవడిని చంద్రబాబు నాయుడు కొనసాగిస్తూ ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధితోపాటు సంక్షేమాన్ని ప్రజలకు అందించి భారత దేశం అభివృద్ధికి విజన్ అయినా 2047 నాటికి అభివృద్ధి చెందిన రాష్ట్రంలో మొదటి వరసలో ఆంధ్రప్రదేశ్ ఉండాలనే సంకల్పంతో పని చేస్తున్న చంద్రబాబు నాయుడుకి ప్రజలందరూ సహాయ, సహకారాలు అందివ్వాలని ఈ సందర్భంగా కోరారు.





స్థానిక హయతినగరంలో గల మహాత్మ జ్యోతి రావు ఫూలే ఆంధ్ర ప్రదేశ్ వెనుకబడిన జాతుల గురుకుల పాఠశాలలో బుధవారం మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు 102వ జయంతి సందర్భంగా ప్రిన్సిపాల్ జి.స్వరాజ్యలక్ష్మి, పాఠశాల సిబ్బంది ఘన నివాళులు అర్పించారు.

– సత్యంన్యూస్, శ్రీకాకుళం

## నర్సింగ్ ప్రవేశాలకు నోటిఫికేషన్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

బీఎస్సీ నర్సింగ్ ప్రవేశాలకు ఎన్టీఆర్ యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ వారు నోటిఫికేషన్ విడుదల చేశారని బొల్లినేని మెడ్‌స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు తెలిపారు. ఈ ఏడాది నుంచి నూతనంగా నిర్వహిస్తున్న ఈ ప్రవేశ పరీక్షకు ఇంటర్ బైపీసీ/ బ్రిడ్జి కోర్సుతో ఒకేషనల్ గ్రూపు పాసైన వారు అర్హులని తెలిపారు. ఈ నెల 28 నుంచి జూన్ 20వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం గలదన్నారు. జూలై 6న కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. నర్సింగ్ చేయాలనుకునే విద్యార్థులు తప్పక దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇంటర్ పాసైన విద్యార్థులకు తమ కళాశాలల్లో డిప్లమో, బీఎస్సీ పారామెడికల్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. వివరాలకు జెమ్స్ ప్రాంగణంలోని తమ కళాశాలను లేదా 7680945357, 9121999654ను సంప్రదించాలని ఆయన సూచించారు.

## ఎన్టీఆర్ ప్రజావ్యవస్థలకు పునాది

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, మహానాయకుడు నందమూరి తారక రామారావు 102వ జయంతిని పురస్కరించుకొని శ్రీకాకుళం జిల్లా కేంద్రంలో బుధవారం అధికారికంగా ఘనంగా వేడుకలు నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ముఖ్యఅతిథిగా హాజరై, ఎన్టీఆర్ సేవలను స్మరించుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ తనది మహారాష్ట్ర అని, తాను చదువుకునే రోజుల్లోనే ఎన్టీఆర్ గురించి విన్నానని స్పష్టం చేశారు. ఆయన నిజాయితీపరుడు, దూరదృష్టిగల నాయకుడన్నారు. రాష్ట్రంలో పెన్షన్ పథకానికి నాంది పలికింది ఆయనేనన్నారు. బ్లాక్ సిస్టమ్‌ను తొలగించి మండల వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. ప్రజావ్యవస్థల్లో సమూల మార్పులకు పునాది వేసిన గొప్ప వ్యక్తి ఎన్టీఆర్ అని కొనియాడారు. తెలుగువారి గౌరవానికి ఆయనే ప్రతీక" అని కలెక్టర్ స్పష్టం చేశారు. వేదికపై అతిథులతో కలిసి ఆయన ఎన్టీఆర్‌కు పుష్పాంజలి ఘటించారు. అంతకుముందు ఉదయం ఏడు రోడ్ల కూడలిలోని ఎన్టీఆర్ విగ్రహానికి జిల్లా అధికారులు పూలమాలలతో ఘన నివాళులు అర్పించారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని పునర్నిర్మించిన మహానాయకుడి సేవలు తర తరాలూ గుర్తుంటాయి అని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డిఆర్‌డిఏ పీడీ కిరణ్ కుమార్, ఆర్డీవో సాయి ప్రత్యూష, జెడ్పీ సీఈవో శ్రీధర్ రాజా, శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ బీవీడీ ప్రసాదరావు ఎమ్మెల్యే గొండు శంకర్ సతీమణి గొండు స్వాతి, మాదారపు వెంకటేష్, జామి భీమ శంకర్, కె.శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.



## రాజ్యాంగ హక్కులు దళితులకు వర్తించవా?

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



ఈ కూటమి ప్రభుత్వంలో రాజ్యాంగ హక్కులు దళితులకు లేవా అని వైకాపా ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు పొన్నాడ రుషి ప్రశ్నించారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెనాలి పట్టణంలో ముగ్గురు దళిత, మైనారిటీ యువకులపై నడిరోడ్డుపై జరిగిన ఈ ఘటన, యావత్ భారత రాజ్యాంగ చట్టాలను, సంస్కరణను, ప్రశ్నించే విధంగా ఉందన్నారు. ఆర్టికల్ 21 ప్రకారం ప్రతి వ్యక్తికి జీవించే హక్కు వ్యక్తిగత స్వేచ్ఛను హరించే హక్కు ఎవరికీ లేదని, కేవలం బలహీనవర్గాలనే చిన్న చూపుతోనే ఈ అమానుషగా చర్య కారణమని, ఈ కారణం వెనుక ఎవరెవరున్నారు, చట్టాలు ఉల్లంఘించమని ఎవరు ప్రోత్సహిస్తున్నారు అనేది తెలియాలన్నారు. ఒకపక్క దేశం గర్వించదగ్గ అత్యున్నత స్థానంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి భారత రాష్ట్రపతి ఒక అణగారిన వర్గానికి చెందిన వ్యక్తులు గౌరవం పొందుతుంటే, కూటమి ప్రభుత్వం అణగారిన వర్గాలకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. నిజంగా ఆ వ్యక్తులు తప్పు చేసిన వాళ్ళు అయితే చట్టపరంగా, న్యాయపరంగా తీసుకోవలసిన చర్యను ఆమోదించాలన్నారు. దీనిని సమాజం కూడా హర్షిస్తుందన్నారు. దీనికి పూర్తి విరుద్ధంగా చట్టాన్ని న్యాయాన్ని ఏ ఒక్కరి చేతులతోనో బంధిస్తామంటే ప్రజలే సమాజం అనే వ్యతిరేక తుఫాన్‌లో కొట్టుకుపోతారన్నారు. ఒకపక్క దళితులకు సాంఘిక బహిష్కరణ, మహిళ అని చూడకుండా వివస్త్రని చేసి దాడి చేయడం, దళిత మహిళను ట్రాక్టర్లతో త్రొక్కించడం, ఒక దళిత వైద్యుడు చెంపపై కొట్టడం, దళితుల భూములను ఆక్రమణ చేయటం, దళిత ఉన్నతాధికారులపై కక్షసాధింపులు, దళిత ప్రజాప్రతినిధులపై అరెస్టులు ఇదేనా కూటమి ప్రభుత్వ లక్ష్యం అని ప్రశ్నించారు. సోదరభావంతో ఉన్న మమ్మల్ని ఎస్సీ వర్గీకరణ పేరుతో వేరుచేసి ఇదే దళిత అభివృద్ధి అంటే నమ్మేటంత మూర్ఖులం కాదన్నారు. తమ ఐక్యతతో భవిష్యత్తులో వీటన్నిటికీ సమాధానం చెప్పే గుణపాఠం ఉంటుందని, పై చర్యలపై తక్షణమే ఎస్సీ ఎస్టీ కమిషన్, మానవ హక్కుల ఉల్లంఘన, దళిత మేధావులు సంఘాలు పెద్ద ఎత్తున సంఘటితంగా పోరాడాలని పిలుపునిచ్చారు. బలహీనుల పట్ల వారి అభివృద్ధి పట్ల జగన్మోహన్‌రెడ్డి అనాడు 125 అడుగుల అంబేద్కర్ విగ్రహా శృతివనాన్ని నిర్మాణం చేస్తే దాన్ని కూడా ధ్వంసం చేసే నీచమైన ఆలోచన చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు.

## ఎన్టీఆర్‌కు ఘన నివాళి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మహానాయకుడు స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి వేడుక బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించి ఆయన చిత్రపటానికి అదనపు ఎస్పి కెవి రమణ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. తెలుగు సమాజానికి అసమాన సేవలు అందించిన మహానాయకుడు ఎన్టీఆర్ జయంతి పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం మే 28వ తేదీని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సందర్భంగా శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్‌రెడ్డి ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు బుధవారం ఉదయం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎన్టీఆర్ త్రపటానికి అదనపు ఎస్పీ కెవి రమణ పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా తెలుగు ప్రజల ఖ్యాతిని ప్రపంచ దేశాలకు చాటి చెప్పిన మహానాయకుడు ఎన్టీఆర్ అని ఎఎస్పీ కొనియాడారు. అతను యొక్క పరిపాలన దక్షత, ప్రజలకు చేసిన సేవలను ఈ సందర్భంగా అదనపు ఎస్పీ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో డిఎస్పీ ఎల్.శేషాద్రి, పోలీస్ కార్యాలయం పరిపాలన అధికారి సిహెచ్ గోపీనాథ్, ఇతర పోలీసు అధికారులు, కార్యాలయ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



## జిల్లా గ్రంథాలయ సంస్థలో ఎన్.టి.ఆర్ జయంతి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బుధవారం రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నందమూరి తారక రామారావు చిత్రపటానికి జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్‌రాజా పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వేసవి శిక్షణా శిబిరంలో టాయ్స్ ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేశారు. విద్యార్థులు క్రాఫ్ట్‌తో తయారుచేసిన పేపర్ బొకేను శ్రీకాకుళం జిల్లా గ్రంథాలయ కార్యదర్శి బుర్రి కుమార్ రాజాకి అందించారు. కార్యక్రమాన్ని ఉదేశించి ప్రసంగించిన కార్యదర్శి బుర్రి కుమార్ రాజా పిల్లల్లో సృజనాత్మకత పెంపోదించుకోవడానికి గ్రంథాలయాలలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు ఎంతో దోహద పడతాయన్నారు. అనంతరం విద్యార్థులకు ఎం. తిరుపతి జనరల్ నాలెడ్జ్ బోధించారు. కార్యక్రమంలో కేంద్ర గ్రంథాలయ డిప్యూటీ లైబ్రేరియన్ వివిజిఎస్ శంకర్ రావు, అసిస్టెంట్ లైబ్రేరియన్ పీవీ భాస్కర్ రాజా ఉపాధ్యాయులు ప్రభాకర్, రాజశేఖర్, సిబ్బంది రామ్మోహన్, గణేష్ పాల్గొన్నారు.



## కార్పొరేట్, ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)



శ్రీకాకుళం జిల్లావ్యాప్తంగా, ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాలు అమ్మకాలు వ్యవహారంపై చర్యలు తీసుకోవాలని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిగిలిపల్లి మదన్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా విద్యాసంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థుల తల్లిదండ్రులకు పుస్తకాలు కొనుక్కోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారని మండిపడ్డారు. నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ, పుస్తకాలు కొనుగోలు చేయాలని డిమాండ్ చేయడం అన్యాయమన్నారు. పుస్తకాల పేరిట సుమారు రూ.10 నుండి 15వేలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. ఇలాంటి విద్యాసంస్థలపై జిల్లా విద్యాశాఖ అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు తెలియడం లేదన్నారు. శ్రీకాకుళం జిల్లా పరిస్థితి చూస్తుంటే విద్యాశాఖ అధికారులకు పెద్ద ముడుపులు అందుతున్నట్లు ఉన్నాయన్నారు. అందుకే అధికారులు నోరు మెదపడం లేదన్నారు. ఇప్పటికే పలుచోట్ల ఏబీవీపీ నాయకులు పుస్తకాలు విక్రయిస్తున్న వారిపై ఉన్నతాధికారులు ఫిర్యాదు చేసి పుస్తకాలు విక్రయాలను అడ్డుకున్నారని తెలిపారు. పుస్తకాల అమ్మకాలు ఆపకపోతే ఎబివిపి ఆధ్వర్యం లో విద్యాసంస్థల ఎదుట ప్రత్యక్ష ఆందోళనకు సిద్ధమవుతుందని హెచ్చరించారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఒక్కరోజు బేసిక్ ఫస్ట్ ఎయిడ్ మరియు ఎనిమిది రోజులు సీనియర్ ప్రొఫెషనల్ ఫస్ట్ ఎయిడ్ శిక్షణ కార్యక్రమాలు జిల్లా రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహించబడతాయని, శిక్షణ పూర్తిచేసుకుని సర్టిఫికెట్ పొందిన వారికి వైద్య ఆరోగ్య శాఖలో గాని, ప్రైవేట్ ఆసుపత్రిలో, కర్మాగారాలు యందు ఉద్యోగ అవకాశం పొందే అవకాశం ఉందని జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ పి. జగన్మోహనరావు గారు తెలియజేశారు. ఇదివరకు శిక్షణ పూర్తి చేసుకుని ఉన్న అభ్యర్థులకు నేషనల్ హెడ్ క్వార్టర్స్ న్యూఢిల్లీ ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మరియు సెయింట్ జాన్ అంబులెన్స్ వారి జారీ చేసిన ధ్రువపత్రాలను అందించడం జరిగినది. ఈ సర్టిఫికెట్స్ భారతదేశంలో స్థాయిలో ఉపయోగపడతాయని తెలియజేశారు. శిక్షణ కావలసిన అభ్యర్థులు నేరుగా రెడ్ క్రాస్ ఆఫీస్ ని గాని ఫోన్ నెంబర్లు9450490525 సంప్రదించగలరు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ ప్రతినిధులు కే సత్యనారాయణ, జి రమణ అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.



## సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక ఓపీ క్లినిక్‌లు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

శ్రీకాకుళం ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ (బలగ రిమ్స్ హాస్పిటల్) లో ఈ క్రింది స్పెషల్ క్లినిక్లు నిర్వహించబడుతున్నాయని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈమేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 29న పక్షవాతం సంబంధిత సమస్యలు ఉన్న వారికి డాక్టర్ జె.వెంకటేష్, డాక్టర్ అనితల ఆధ్వర్యంలో ప్రత్యేక క్లినిక్ నిర్వహించి అవసరమైన పరీక్షలు నిర్వహిస్తామన్నారు. అటువంటి వ్యాధులు వారికి, అటువంటి పరీక్షలు మరియు చికిత్స సలహాలు ఇస్తామన్నారు. వారు వారి పాత రికార్డులను పట్టుకుని 29న ఉదయం 9 నుండి 12 గంటల వరకు ఆసుపత్రిలో సంప్రదించాలని కోరారు.


డ్రైవర్లు కావలెను
సాయిప్రియ ట్రావెల్స్
శ్రీకాకుళంలో పని చేయుటకు
డ్రైవర్లు కావలెను
కనీసం 2 నుండి 3 సంవత్సరాల అనుభవం కావలెను.
CONTACT:
9440001447, 8341163666

ఎం.ఇర్షాద్
USHA
ఆథరైజ్డ్ డీలర్స్
షాప్: 08942-229343
సెల్: 95731 43409
ఎ.కె. ఎంటర్‌ప్రైజెస్
ఉషా సెవింగ్ మిషన్స్, ఆఫీస్ ఫర్నిచర్..
అన్ని రకాల సెవింగ్ మిషిన్లు, ఫేషన్ మేకర్స్, ఎంబ్రాయిడరీ మిషిన్లు, స్పేర్స్ హోల్‌సేల్
రాజా కాంప్లెక్స్, కరెంట్ ఆఫీసు ఎదురుగా, జి.టి. రోడ్డు, శ్రీకాకుళం - 532 001


SSJ
శ్రీ స్వర్ణ జ్యూయలరీ
ప్రొ॥ వాళ్ళ కిరణ్‌కుమార్
99636 89666, 90009 07133
జి.టి. రోడ్డు, శ్రీకాకుళం
E-mail: sriswarnajewelleries@gmail.com

SAI OPTICIANS
సరస్వతి మహల్ ఎదురుగా, శ్రీకాకుళం
ప్రొప్రయిటర్: బి.రమణమూర్తి
సెల్: 94407 59739
బ్రాంచ్ ఆఫీస్: గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజ్ రోడ్డు, శ్రీకాకుళం, సెల్: 94407 59739

Siva Srinivasa
Sofa Emporium
Lade Chandra Sekhar Rao
Ph. No: 94401 21710
63053 35395, sekharlifestyle99@gmail.com
NEAR SURYA MAHAL THEATRE
WOMEN'S COLLEGE ROAD,
SRIKAKULAM - 532 001

# 'మీనాక్షి'లో అరుదైన శస్త్ర చికిత్స

* యువకుని శరీరంలో 50 సెంటీమీటర్ల బల్ల తొలగింపు
* కుచించిన తర్వాత ప్లీహం (బల్ల) బరువు 4 కిలోలు
* ఆపరేషన్ సమయంలో పేషెంట్‌కు 7 గ్రాముల హిమోగ్లోబిన్, 16వేల ప్లేట్‌లెట్స్ మాత్రమే
* విజయవంతంగా ఆపరేషన్ చేసిన గొండు గంగాధర్





(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

నగరంలోని మీనాక్షి ఆసుపత్రిలో అరుదైన, అత్యంత క్లిష్టమైన శస్త్ర చికిత్సను సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ గొండు గంగాధర్ రావు విజయవంతంగా నిర్వహించారు. 36 సంవత్సరాల యువకుడు చాలాకాలంగా ఐటీపీ (చాలా తక్కువ ప్లేట్లెట్ కౌంట్‌తో కూడిన రుగ్మత)తో బాధ పడుతున్నాడు. ఈ కారణంగా అతనికి ప్లేహం (బల్ల) పెరిగి (సుమారు 50 సెం.మీ.) ఉదర భాగం మొత్తం వ్యాపించడంతో అతనికి ప్లేట్లెట్ కౌంట్ ఇంకా తగ్గడం, రక్తం గడ్డకట్టే శక్తి నశించడం, రక్తహీనత, వ్యాధినిరోధక శక్తి నశించడం, ఆహారం తీసుకోలేకపోవడం, కనీసం తేలికపాటి పని కూడా చేసుకోలేకపోవడంతో ఆరోగ్యం బాగా క్షీణించింది. దీంతో ఆయన మీనాక్షి ఆసుపత్రిని సంప్రదించాడు. అతడికి పరీక్షలు నిర్వహించి, శస్త్రచికిత్స అవసరమని గుర్తించారు. శస్త్ర చికిత్స చేసే సమయంలో అతడికి కేవలం 7 గ్రాముల హిమోగ్లోబిన్, 16వేలు ప్లేట్లెట్ కౌంట్ ఉంది. ఇటువంటి పరిస్థితుల్లో రక్తం గడ్డకట్టే సామర్థ్యం చాలా తక్కువగా ఉండి, శస్త్రచికిత్స సమయంలో ప్రాణాంతకమైన రక్తస్రావం జరిగే అవకాశం ఉంటుంది. శస్త్ర చికిత్సను అత్యంత నైపుణ్యంతో, ఎటువంటి రక్తస్రావం జరగకుండా, ప్లేహాన్ని విజయవంతంగా తొలగించారు. తొలగించిన ప్లేహం సుమారు 40 సెం.మీ. (కుచించిన తర్వాత), నాలుగు కిలోలు ఉన్నట్లు గుర్తించారు. శస్త్ర చికిత్స అనంతరం పేషెంట్ చక్కగా కోలు కొని, 3.5 లక్షల ప్లేట్లెట్ కౌంట్‌తో ఆరోగ్యంగా డిశ్చార్జ్ అయ్యాడని తెలిపారు.







# కారుణ్య కోటాకు కన్నం!

(మొదటిపేజీ తరువాయి)

ఇన్‌ఛార్జి మంత్రి సంతకం చేసిన ఐదు నెలల తర్వాత మరో మంత్రి అచ్చెన్నాయుడు నియామకాలను ఆపాలని ఆదేశించినట్టు కలెక్టరేట్ ఏవో సూర్యనారాయణకు అనురాధ చెప్పడం అనుమానాలకు తావిస్తోంది. వాస్తవానికి కారుణ్య నియామకాలను ఎవరూ అడ్డుకోరు. ఉద్యోగి మృతిచెందిన ఆరునెలల్లోనే వారి కుటుంబంలో ఒకరికి కారుణ్య కోటా ఉద్యోగం ఇవ్వాలి. కాని బీసీ సంక్షేమ శాఖలో పని చేస్తూ మృతిచెందిన ఆరుగురు ఉద్యోగుల కుటుంబాలకు మాత్రం నాలుగేళ్లు కావస్తున్నా న్యాయం జరగలేదు. దీనిపై 2022 నవంబర్ 11న గ్రీవెన్స్‌కు ఒక ఫిర్యాదు అందినా అధికారులు పట్టించుకోలేదు. ఎమ్మెల్యే కూన రవికుమార్, గౌతు శిరీష తమ నియోజకవర్గ పరిధిలోని బాధితుల గురించి ఎనిమిది నెలల క్రితమే కలెక్టర్‌కు విన్నవించినా ఆ ఫైలుకు మోక్షం కలగలేదు.

## అర్హుడి స్థానంలో అనర్హుడు

నిబంధనల ప్రకారం కలెక్టరేట్ కారుణ్య నియామకాలను కలెక్టరేట్ ఏవో ద్వారా చేపట్టాలి. ఉద్యోగార్థుల అర్హతలు, ఆయా శాఖల్లో ఉన్న ఖాళీల ఆధారంగా పోస్టింగులు ఇవ్వాలి. అయితే ప్రస్తుత ప్రక్రియ ఆ విధంగా జరగలేదని, అర్హులమైన తమను తప్పించి మరో అనర్హుడిని కారుణ్య కోటా జాబితాలో చేర్చారంటూ డీబీసీడబ్ల్యూవో అనురాధపై సదరు బాధిత కుటుంబం కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. ఇదే మొత్తం ఫైలును ఆమె తొక్కిపెట్టేయడానికి కారణమని బాధితులు ఆరోపిస్తున్నారు. బీసీ సంక్షేమ వసతి గృహంలో పని చేస్తున్న బుంజు పాపారావు (రాజపురం) 2023 ఆగస్టు 10న, పైల రమేష్ (ప్రియాగ్రహారం) 2021 ఆగస్టు 8న, శ్రీకాకుళం (4) కాలేజి గర్ల్స్ హాస్టల్‌లో పని చేస్తున్న బురిడి సరిత 2023 జూలై 2న, శ్రీకాకుళం (3) కాలేజి గర్ల్స్ హాస్టల్‌లో పని చేస్తున్న దుప్పలపూడి కనకరత్నం 2024 జనవరి 14న మృతి చెందారు. వీరితో పాటు సిద్ధ ప్రమీల, సువ్వారి లోకనాథం అనే ఉద్యోగులు కూడా 2014లో మృతి చెందారు. వీరి వారసులకు కారుణ్య కోటాలో ఉద్యోగాలు ఇవ్వాల్సి ఉంది. బీసీ సంక్షేమశాఖ అధికారులు అందులో బుంజు పాపారావు వారసుడి పేరును జాబితా నుంచి తొలగించి వేరే అనర్హుడి పేరు చేర్చేశారు. ఈ విషయాన్ని పాపారావు కుటుంబ సభ్యులు అన్ని ఆధారాలతో సహా లిఖితపూర్వకంగా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గతంలో అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేసిన కోట రామారావును 2016 నవంబర్‌లో అప్పటి బీసీ సంక్షేమాధికారి టెర్మినేట్ చేశారు. ఆతర్వాత రామారావు మృతి చెందాడు. కానీ ఇప్పుడు అదే రామారావును ఉద్యోగిగా ఉండగా మరణించినట్లు చూపించి అతని భార్య పేరును కారుణ్య నియామకాల జాబితాలో చేర్చి కలెక్టర్, మంత్రితో సంతకాలు చేయించేశారు. దీనిపై బాధితులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడం, అన్ని అర్హతలు ఉన్న బుంజు పాపారావు కుటుంబానికి జరిగిన అన్యాయంపై పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కలెక్టర్‌కు లేఖ రాయడంతో వ్యవహారం వెలుగు చూసింది.


In view of the above, if the District in-charge Minister, Srikakulam District ...on'ble Minister for MSME, SERP NRI Empowerment & Relations, Govt of AP ...ees, the appointment of the above 6(six) individuals may be appointed in the ...ve hostels may be approved, so as to submit the details of her in the APCOS ...ssue of Placement Intimation Letter.

Submitted for Orders,

District In-charge Minister & Hon'ble Minister for MSME, SERP NRI Empowerment & Relations, Govt. of AP.

ఉత్తర్వులపై సంతకం చేసిన జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి

## డీబీసీడబ్ల్యూపై విచారణకు ఆదేశాలు

జాబితాను తారుమారు చేసి ఒక అనర్హుడిని చేర్చడంపై డీబీసీడబ్ల్యూవో అనురాధను కలెక్టర్ వివరణ కోరగా తనకు తెలియకుండా ఫైల్ పెట్టారంటూ జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులపై నెపం నెట్టే ప్రయత్నం చేశారని తెలిసింది. దాంతో ఈ వ్యవహారంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేసి విచారణకు ఆదేశించారు. అనురాధపై వస్తున్న ఆరోపణలుపై పూర్తిస్థాయి విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ రెండు రోజుల క్రితం ఆదేశించారు. ఆ మేరకు విచారణాధికారిని నియమించి, బాధితులతో పాటు డీబీసీడబ్ల్యూవో అనురాధకు నోటీసులు పంపి వాంగ్మూలాలు తీసుకునేందుకు కలెక్టకేట్ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

# ఫీజుల భారం తగ్గించండి

* శ్రీకాకుళం జిల్లా ఇంటర్ విద్యాశాఖాధికారికి వినతి
* డీఐఈఓని కలిసిన ప్రతినిధులు
* ఫస్టియర్ వృత్తివిద్య కోర్సుల ఫీజులపై ఫిర్యాదు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రభుత్వ జునియర్ కళాశాలల్లో వివిధ ఒకేషనల్ కోర్సుల ఫీజుల భారాన్ని తగ్గించాలనీ, మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రవేశరుసుము విషయంలో నెలకొన్న గందరగోళం విషయంలో స్పష్టతనివ్వాలనీ కోరుతూ జేఎల్స్ ప్రతినిధులు ఇంటర్ విద్యాధికారి ఆర్.సురేష్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. ఒకేషనల్ కోర్సులలో ప్రవేశం పొందుతున్న మొదటి సంవత్సరం విద్యార్థుల ప్రవేశరుసుము విషయంలో కొన్ని కళాశాలల్లో ఒక విధంగానూ, మరికొన్ని కళాశాలల్లో మరో రకంగానూ వసూలు చేస్తున్నారనీ ఆరోపించారు. కమిషనర్ ఇచ్చిన ఆదేశాల ప్రకారం వృత్తివిద్యలో చేరిన విద్యార్థులు రెండురకాల ల్యాబోరేటరీ ఫీజులను మాత్రమే చెల్లించాల్సి ఉండగా, కొన్ని కళాశాలలు సైన్స్ విద్యార్థుల కోసం ఉద్దేశించిన గ్రూప్-డి లో పేర్కొన్న ల్యాబ్ ఫీజు రూ.495 అదనంగా ఒకేషనల్ విద్యార్థుల నుంచి వసూలు చేస్తున్నాయనీ డీఐఈఓ దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వ కళాశాలల్లో చేరే విద్యార్థులకు ప్రభుత్వం పుస్తకాలు, నోట్సులు, బ్యాగు, ఉచిత భోజనం అందిస్తూ ప్రవేశాలు పెరిగేందుకు కృషి చేస్తుంటే, పేద విద్యార్థులపై అదనపు ఫీజు భారం మోపడం అన్యాయమన్నారు. గ్రూప్-డీలో పేర్కొన్న సైన్స్ విద్యార్థుల లేబోరేటరీ ఫీజు నుంచి ఒకేషనల్ విద్యార్థులను మినహాయింపు ఇవ్వాలని కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం ప్రతినిధి కరణం రవీంద్రనాథ్ ఠాగూర్, స్టేట్ మీడియా కోఆర్డినేటర్ దుగ్గివలస రాంప్రసాద్ డీఐఈఓని కోరారు. ఈ విషయమై ఉన్నతాధికారులతో చర్చించి ఫీజు తగ్గింపుపై స్పష్టమైన ఆదేశాలు త్వరలో జారీ చేస్తామని డీఐఈఓ హామీ ఇచ్చారు.



## బానిస వ్యాపారుల వేలం పాట
# అందాల పోటీ



(మొదటిపేజీ తరువాయి)

చొచ్చుకుపోయింది. శరీరంపైనే అందం పరిశ్రమ ఆగిపోతుందనే భ్రమలు అవసరం లేదు. శరీరం లోపలికి కూడా దూరిపోయింది. బ్యూటీ డ్రింక్స్ ఏవేవి కలిపి తాగితే అందం పెరుగుతుంది. ఏది తాగితే, తింటే ఏ భాగం అందంగా మెరుగుపడుతుంది. విటమిన్లు, ఖనిజాలు వాటికి ట్యాబ్లెట్లు అందాన్ని జారిపోకుండా, పాడైపోకుండా నిలబెట్టే నిరోధక వ్యవస్థలు వగైరాలతో వీటిపై పరిశోధన ట్యాబ్లెట్లు, టానిక్లు, డ్రింకులతో కూడి మొత్తం ఇది ఒక ప్రత్యేక పరిశ్రమగా నిలుస్తోంది. ఇక మరొకటి అందానికి సలహాలు, చిట్కాలు వగైరాలతో ప్రకటనలు. అందానికి సంబంధించిన మొబైల్ యాప్‌లతో పాటు 'నీవే చేసుకో వచ్చు, ప్రయత్నించి చూడు' ఇంట్లోనే నీ దగ్గర ఉన్న వాటితోనే అంటూ రకరకాల వెబ్‌సైట్లు సలహాలు, సూచనలు ఇస్తుంటాయి.

ఒక స్త్రీ మరొక స్త్రీపై చేసే పరిశీలన ఎలా ఉందంటే ఏం ధరించింది, మేకప్ ఎలా వేసుకుంది, ఏ దుస్తులు వేసుకుంది లాంటి వాటిని ఒక్క క్షణంలో తేరిపార చూసేసి నిర్ధారించి అంచనావేసే ఒక దృష్టిని ఈనాటి తరానికి అందాల పరిశ్రమ నేర్పిస్తుంది. 'ఎట్లా చూడాలి', 'ఏం చూడాలి' అనేది గత తరం స్త్రీలకు నేటి యువతకు ఒక వ్యాపారం కల్పించిన తేడా ఈ దృష్టి కోణం.

నేనెంత అందంగా, వెర్రెక్కించేలా ఉన్నాను? ఎంత వయసులా కనపడుతున్నాను?.. ఇదే యావ, రోజుకు పది సార్లు సెల్ఫీలు. సర్దుకోవడాలు పోల్చుకోవడాలు ఇదే వ్యాపకం. అందమైన పెదాలకు పది చిట్కాలు నేర్చుకోవడం అదే నైపుణ్యం. అందపు యాప్‌లు ఏ దశ వరకు పెరిగాయంటే స్త్రీల శరీరం, మొహం అనేది సంక్షోభ వినిమయ కేంద్రాలుగా మారిపోయాయి. స్త్రీల సమానత్వ గౌరవ పోరాటంపై ప్రతి దాడి అందాల పరిశ్రమ. స్త్రీలంటే శరీరం కాదన్న నినాదాన్ని తిరగ రాసి స్త్రీలు అంటే శరీరం మాత్రమే అని ప్రకటించింది. ఈ అందం ఒక మతం, ఒక క్రతువు, ఒక సంప్రదాయం, ఒక వినూత్నమైన రూపంలో దాడి చేస్తున్న అతి పాత కొలమానం.

ఈ వినిమయంగా మారిపోయిన అందం లైంగికతపై దాడి, శరీరంపై పునరుత్పత్తిపై హక్కు పొందిన స్త్రీలను వారి శరీరాలపై హక్కు వారే వదులుకునేలా చేసిన ఒక కుట్ర. వారి కదలికలు, వారి నడక, వారి భంగిమ, వారి పలుకు అన్నింటిపై ఈ అందాల పరిశ్రమ నియంత్రణ సాధించింది. అందాల పరిశ్రమ తయారుచేసే కృత్రిమ అందం తప్ప స్త్రీలకు వేరే గుర్తింపు లేకుండా చేసింది. ఈ అందం సార్వజనీనమైందిగా అందరూ వాంఛించేదిగా సృష్టించింది. స్త్రీలు అందాన్ని కోరుకుంటారు. పురుషులు అందమైన స్త్రీలను కోరుకుంటారు. స్త్రీలు తమ అందాన్ని మెరుగుపరుచుకునే శ్రమలో ఉంటారు. పురుషులు పరిశ్రమలు పెట్టి డబ్బు సంపాదించింది, అందమైన స్త్రీలను పొంది, వారిని తమ విజయ చిహ్నాలుగా ప్రదర్శించుకుంటారు. భాష ఏదైనా రూపం అత్యాధునికమైన అందాల పోటీల సారాంశం ఇదే. స్త్రీ అందం పురుష ప్రపంచంలో ఒక మారకద్రవ్యం (కరెన్సీ). ఈ అందం అనే దాన్ని కరెన్సీగా వాడటం పారిశ్రామిక విప్లవంతో ప్రారంభమై నేటి కార్పోరేట్ కాలానికి పతాక స్థాయికి చేరింది. ఈ అందం అనే భ్రమ కేవలం లైంగిక దోపిడీకి, శారీరక దోపిడీకి సంబంధించిన అంశం కాదు. అది ఒక రాజకీయ భావజాలం.

అందాన్ని సామర్థ్యానికి, తెలివికి, కొలమానంగా విజయవకాశాలకు పునాదిగా భావిస్తే దాన్ని ప్రామాణీకరిస్తే ఈ రక్షణ రేఖకు బయట ఉన్న అసంఖ్యాకమైన స్త్రీలు ఎంత అవమానానికి ఎంత తిరస్కారానికి ఎంత దోపిడీకి గురవుతారు? మొత్తం సేవా రంగంలో రిసెప్షనిస్టుల దగ్గర నుంచి ఎయిర్ హోస్టెస్ వరకు అందం ఇప్పటికీ ఒక అవసరంగా మారిపోయింది. అందంగా ఉన్నవాళ్లే బాగా చదువుకుంటారనే సామెత కూడా పాతదే కొనసాగుతున్నది. 'బ్యూటీ విత్ బ్రెయిన్స్' అందాల పోటీలెంత ప్రకటించిన దానిలో ప్రశ్నలు బుర్ర తక్కువ ప్రశ్నలే.

సామర్థ్యమున్న స్త్రీలు, శాస్త్రవేత్తలు, వ్యవసాయదారులు, నిపుణులైన శ్రామికులు ఉత్పాదక శ్రమల్లో అనుత్పాదక శ్రమల్లో తీరికలేని వాళ్లు 'అందం' దెబ్బకి ఆత్మ న్యూనతకూ తిరస్కారాలకు గురవ్వాలా?

**అసలు అందానికి ఒక నిర్వచనం ఒక ప్రమాణం ఉందా? ఉంటుందా? అది సాధ్యమేనా! తెలుపే అందమా? అంటే వాళ్ల వ్యాపారం యూరప్‌లో ఉంటే తెలుపు అందం. ఆఫ్రికాలో ఉంటే నల్లటి చర్మపు మెరుపందం అంటారు. రకరకాల శరీరపు రంగులు, అవయవాల పొందికలు, శరీర నిర్మాణ చక్రాలు ముక్కు, మొహం అమరికలు గల ప్రపంచంలో అందానికి పోటీలు అంటే అందాన్ని ఒక రకం అవయవాల కొలతలకు అమరికలకు పరిమితం చేయటమే. స్త్రీలను విజ్ఞానులుగా, నిపుణులుగా, ఆటగాళ్లుగా తయారు కానీయకుండా దారి మళ్లించి శరీరాలుగా మార్చడం. వారి మేధస్సును వికసించనీయకుండా ఆపడం.. ఇది వ్యాపారం కాదు. ఇది అవకాశం కాదు. ఇది మానసిక శారీరక బానిసత్వం. అది 'ప్రపంచ సుందరి' వేదిక కాదు.**

స్త్రీల శరీరాలను కర్రలతో పొడిచే దాని బిగుతును సొగసును వేలం వేసే బానిస వ్యాపారుల కబేలా. ఈ బానిస వ్యాపారాన్ని ప్రపంచం అంతా ఛీత్కరించాలి. ఈ మానవ మాంసపు అశ్లీల అమ్మకాలనీ తిరస్కరించాలి.

# ప్రతీ విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

## - లయన్స్ ఇంటర్నేషన్ జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

చదరంగం క్రీడతో ఉత్తమ క్రమశిక్షణ అలవడుతుందని, విద్యార్థులు చదువులోను, క్రీడల్లోను రాణించాలని లయన్స్ ఇంటర్నేషనల్ జోన్ చైర్మన్ పొన్నాడ రవి కుమార్ అన్నారు. స్థానిక రెడ్‌క్రాస్ నైపుణ్యాభివృద్ధి భవనంలో చదరంగం పోటీలను లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటార్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, కార్యదర్శి డాక్టర్ పైడి సింధూర, లయన్ బరాటం లక్ష్మణ రావు, పూర్వపు సిండికేట్ సభ్యులు ప్రారంభించారు. స్కూల్ ఆఫ్ చెస్ అకాడమీ బేరి చిన్నారావు ఆధ్వర్యంలో చిల్డ్రన్స్ చెస్ ఛాంపియన్ టోర్నమెంట్ ఉత్సాహంగా జరిగిందని, నగరంలోని విద్యార్థులతో పాటు, విశాఖపట్నం నుంచి కూడా సుమారు వందమంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు.



అనంతరం చెస్ విజేతలకు రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ మెంటర్ నటుకుల మోహన్, జోన్ చైర్మన్ పొన్నాడ రవి కుమార్, నూతన అధ్యక్షురాలు లయన్ డాక్టర్ పైడి సింధూర చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను, బంగారు పతకాలను, జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఫిడే ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ ప్లేయర్ స్కూల్ ఆఫ్ చెస్ ఆకాడమీ కోచ్ భేరి చిన్నారావు, క్రీడాకారులు, తల్లిదండ్రులు, విద్యావేత్త లయన్ బరాటం లక్ష్మణ రావు, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ నూతన కార్యదర్శి టెక్కం రామ్‌గోపాల్, నూతన ఉపాధ్యక్షులు ఉర్లం శివతేజ పట్నాయక్, సీనియర్ సభ్యులు శిల్లా మణి, మానవత సభ్యులు డాక్టర్ చింతాడ కృష్ణ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# శాఖాగ్రంథాలయంలో ఎన్టీఆర్ జయంతి



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం లావేరు శాఖా గ్రంథాలయంలో మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఎన్టీఆర్ చిత్రపటానికి గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ జీవిత చరిత్రపై నిర్వహించిన వ్యాస రచన పోటీ విజేతలకు గ్రంథాలయం తరపున బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పి.మల్లేశ్వరరావు, గ్రంథాలయ సహాయకులు టి.వీరభద్రుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎర్రన్న విద్యాసంకల్పం
# మాక్‌టెస్ట్ జూన్ 1న

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)




ఎర్రన్న విద్యా సంకల్పం 2025 కార్యక్రమంలో భాగంగా, జూన్ ఒకటో తేదీన శ్రీకాకుళం, టెక్కలిలో డీఎస్సీ అభ్యర్థుల కోసం కంప్యూటర్ ఆధారిత డీఎస్సీ (ఎస్జీటీ) మాక్‌టెస్ట్ నిర్వహిస్తున్నట్లు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు కార్యాలయం తెలిపింది. ఈమేరకు బుధవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ మాక్‌టెస్ట్ వాస్తవిక పరీక్షా వాతావరణ అనుభవం కల్పిస్తుందని వెల్లడించారు. పోటీ పరీక్షలకు సాధన చేస్తున్న జిల్లాకు చెందిన యువత ఈ పరీక్షను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. అభ్యర్థులు https://www.yvssrikakulam.live/ లింక్ ద్వారా నమోదు చేసుకోవాలని ఆ ప్రకటనలో కోరారు.

Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.